సాక్షి
కుమురం భీమ్

మంగళవారం । 21 । ఫిబ్రవరి । 2023



ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులకు 'గ్రామీణ బాలికల ప్రతిభా పురస్కారాలు' అందించారు. తొమ్మిదో తరగతి మార్కుల ద్వారా వీరిని ఎంపిక చేశారు. 8లో▸



బాల్‌బ్యాడ్మింటన్ విజేత తమిళనాడు

41వ నేషనల్ సబ్ జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు ముగిసాయి. తమిళనాడు బాలుర, బాలికల జట్లు విజేతగా నిలిచాయి. 10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 18.3 /37.4

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత పెరుగుతుంది. ఎండతో ఉక్కపోత అధికమవుతుంది.

న్యూస్‌రీల్

చట్టాలపై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న జడ్జి షరీనా

ఆసిఫాబాద్‌రూరల్: చట్టాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని సివిల్ జడ్జి షరీనా అన్నారు. జిల్లా కేంద్రంలోని సెయింట్ మేరి పాఠశాలలో సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. బాల్యవివాహాలు, మహిళా చట్టాల గురించి పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు సతీశ్‌కుమార్, నరహరి, రాజీవ్‌రెడ్డి, ఎంఈవో మనుకు కుమార్, ప్రిన్సిపాల్ మేరి తదితరులు పాల్గొన్నారు.

'ధరణి' దరఖాస్తులు వేగంగా పరిష్కరించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్‌అర్బన్: ధరణి పోర్టల్‌లో వచ్చిన దరఖాస్తులను వేగంగా పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రాజేశంతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ధరణిలోని 33 మాడ్యూల్స్ ద్వారా అందిన దరఖాస్తులను పరిశీలించి, రికార్డులను అనుసరించి పూర్తిస్థాయి నివేదిక రూపొందించాలన్నారు. పేరు, విస్తీర్ణం, సవరణలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న వాటిపై నివేదికలు అందించాలని తహసీల్దార్లను ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌వో రాజేశ్వర్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

'తొలిమెట్టు'తో నాణ్యమైన విద్య



విద్యార్థులతో మాట్లాడుతున్న సభ్యులు

రెబ్బెన(ఆసిఫాబాద్): తొలిమెట్టు కార్యక్రమం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని తొలిమెట్టు కార్యక్రమాల రాష్ట్రస్థాయి పరిశీలన బృందం సభ్యులు సూచించారు. రాష్ట్ర స్థాయి సహకార పర్యవేక్షణ బృందం కోఆర్డినేటర్ ఎస్‌సీఈఆర్టీ ప్రొఫెసర్ త్రివేణి, సభ్యులు హనుమండ్లు, రాష్ట్ర రిసోర్స్ గ్రూప్ సభ్యులు కాసం సంతోష్, ఐలాపురం విద్యాసాగర్ సోమవారం రెబ్బెన మండలంలోని పలు పాఠశాలలను సందర్శించారు. రెబ్బెన, తుంగెడ, కేజీబీవీ, ఎంపీపీఎస్ తుంగెడ, ఎంపీపీఎస్ కొమ్ముగూడ పాఠశాలలను సందర్శించి తొలిమెట్టు కార్యక్రమాల అమలును పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు, రికార్డులు, రిజిస్టర్ల నిర్వహణ, మార్కుల నమోదు ప్రక్రియ తదితర అంశాలపై ఆరా తీశారు. ప్రాథమిక పాఠశాలల్లో తొలిమెట్టు కార్యక్రమాల తీరుతెన్నులు, విద్యార్థుల అభ్యసన ఫలితాల సాధన వంటి విషయాలను పరిశీలించారు. జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి తదితరులు ఉన్నారు.

23న వాహనాల వేలం

కాగజ్‌నగర్‌టౌన్: వివిధ కేసులలో పట్టుబడిన వాహనాలకు ఈ నెల 23న ఎక్సైజ్ స్టేషన్‌లో వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ విలాస్‌కుమార్ తెలిపారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి జ్యోతి కిరణ్ సమక్షంలో వాహనాల వేలం జరుగుతుందన్నారు. ఆసక్తిగల వారు కాగజ్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.



ఆసిఫాబాద్ పట్టణం

ప్లాన్ రెడీ..!

- 3,283 ఎకరాల్లో మాస్టర్ ప్లాన్ అమలు
- నన్నాహాల్లో టౌన్ అండ్ కంట్రీ ప్లాన్ విభాగం
- రెండు క్లస్టర్లుగా ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం విభజన
- ప్రణాళికాబద్ధంగా పట్టణాభివృద్ధికి చర్యలు
- ఉత్తర్వులు రాగానే రంగంలోకి అధికార యంత్రాంగం

సాక్షి, ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం రూపురేఖలు సమూలంగా మారనున్నాయి. తూర్పు ఏజెన్సీ ప్రాంతానికి కేంద్ర బిందువుగా ఉన్న ఆసిఫాబాద్‌ను రెండు క్లస్టర్లుగా విభజించి ఏకంగా 3,283 ఎకరాల్లో మాస్టర్ ప్లాన్ అమలుకు టౌన్ అండ్ కంట్రీ ప్లాన్ విభాగం(డీటీసీపీ) సిద్ధంగా ఉంది. ఫలితంగా పట్టణం ప్రణాళికాబద్ధంగా విస్తరించనుంది. ఇందుకోసం ఇండికేటివ్ ల్యాండ్ యూజ్ ప్లాన్ (ఐఎల్‌యూపీ) అమలు చేయనున్నారు.

ప్రణాళికలు సిద్ధం..

మాస్టర్ ప్లాన్‌లో భాగంగా జిల్లా కేంద్రాన్ని రెండు క్లస్టర్లుగా విభజించారు. పట్టణ సుందరీకరణతోపాటు జిల్లా కేంద్రం నలువైపులా అభివృద్ధి పరుగులు పెట్టేలా డీటీసీపీ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. అందులో భాగంగా ఇప్పటికే జిల్లా కేంద్రంలో ఆ విభాగం ఉన్నతాధికారులు పర్యటించి మాస్టర్ ప్లాన్ రూపకల్పన ప్రక్రియ పూర్తి చేసినట్లు సమాచారం. మొన్నటి వరకు గ్రామ పంచాయతీగా ఉన్న ఆసిఫాబాద్‌ను ఇటీవల మున్సిపాలిటీగా గుర్తిస్తూ ప్రభుత్వం ఆర్డినెన్స్‌కు ఆమోదం తెలిపింది. పురపాలక శాఖ నుంచి అధికారిక ఉత్తర్వులు అందగానే ఆసిఫాబాద్‌లో మాస్టర్ ప్లాన్ అమలు చేయాలని అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది.

3,283 ఎకరాల్లో అభివృద్ధి..

పట్టణాన్ని రెసిడెన్షియల్, కమర్షియల్ జోన్లుగా విభజించి అభివృద్ధి చేపట్టనున్నారు. ఇందులో 1,366.65 ఎకరాల్లో నివాస ప్రాంతాలు, పట్టణీకీకరణ కోసం 398.75 ఎకరాలు, 153 ఎకరాల్లో పరిశ్రమలు, 97.15 ఎకరాల్లో వాణిజ్య సముదాయాలు, నీటి వనరుల కింద 174.75 ఎకరాలు, గ్రీన్ బెల్ట్(పచ్చదనం) కోసం 188.20 ఎకరాలు, పబ్లిక్, సెమీపబ్లిక్ కింద 555.05 ఎకరాలు, పట్టణ సమీప వ్యవసాయ క్షేత్రాలకు 47.45 ఎకరాలు, రీక్రియేషన్ కింద 81.10 ఎకరాలు, రహదారుల కోసం 208.40 ఎకరాలు, ట్రాన్స్‌పోర్ట్, కమ్యూనికేషన్ కోసం 6.60 ఎకరాలు, శ్మశాన వాటికలు కోసం 8 ఎకరాలకు ఇండికేటివ్ ల్యాండ్ యూసేజ్ ప్లానింగ్ కిందకు చేర్చారు. మాస్టర్ ప్లాన్ అమలైతే ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.

బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్

- నేడు జిల్లా కేంద్రంలో జయంతి ఉత్సవాలు
- ఏర్పాట్లు చేసిన ఉత్సవ కమిటీ సభ్యులు
- విద్యాసంస్థలకు సెలవు ప్రకటించిన కలెక్టర్





జిల్లా కేంద్రంలో ఉత్సవాలకు ఏర్పాట్లు

కెరమెరి(ఆసిఫాబాద్): బంజారాల(లంబాడాలు) ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్ జయంతి నేడు ఘనంగా నిర్వహించేందుకు సేవాలాల్ ఉత్సవ కమిటీ నాయకులు సన్నద్ధమవుతున్నారు. జిల్లా కేంద్రంలో రెండు రోజులుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 15 నుంచి జిల్లాలోని తండాల్లోనూ ఉత్సవాలు జరుపుకొంటున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్స్ సమీపంలో మంగళవారం ఉదయం 11 గంటలకు జయంతి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సేవాలాల్ ఉత్సవ కమిటీ జిల్లా గౌరవ అధ్యక్షుడు రాథోడ్ శంకర్‌నాయక్ తెలిపారు. ఇప్పటికే కలెక్టర్ హేమంత్ బోర్కడే జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు.

మూగజీవాలపై ఎనలేని ప్రేమ..

సేవాలాల్ మహరాజ్ కర్నాటక రాష్ట్రంలోని స్వర్ణ గుంప (ప్రస్తుతం ఈ గ్రామం అనంతపూర్ జిల్లాలో ఉంది)లో 1739 ఫిబ్రవరి 15న భీమానాయక్, ధర్మనీ దంపతులకు జన్మించారు. మోరమ్మగా పిలిచే అమ్మవారు జగదాంబ ప్రత్యక్షమై సేవాలాల్‌ను తనకు అప్పగించమని భీమానాయక్‌ను కోరుతుంది. దీనికి సేవాలాల్ ఒప్పుకోకపోవడంతో అమ్మవారు అతడిని ఎన్నో కష్టనష్టాలకు గురిచేసిందని పురాణాలు చెబుతున్నాయి. తండాల్లో కూడా ఇబ్బందులు ఎదురుకావడంతో ప్రజలు సేవాలాల్‌ను బహిష్కరిస్తారు. అమ్మవారిని శాంతి పరిచేందుకు మేకలు బలిచ్చేందుకు సిద్ధమవుతారు. దీనికి ఎదురుపడిన సేవాలాల్ తనను బలి ఇవ్వాలని కోరుతాడు. తండా వాసులు అతని తలను ఖండించి అమ్మవారికి సమర్పిస్తారు. మూగజీవాలపై సేవాలాల్‌కు ఉన్న ప్రేమను గుర్తించిన జగదాంబ అమ్మవారు అతడికి ప్రాణం పోసిందని పెద్దలు చెబుతారు. అప్పటినుంచి సేవాలాల్ అమ్మవారిని మార్గదర్శకురాలిగా భావించి దేవి అడుగుజాడల్లో నడుస్తాడు. అలాగే లంబాడాలు సైతం సేవాలాల్‌ను గురువుగా స్వీకరించారు. ఏటా ఫిబ్రవరి 16 నుంచి దీక్షలు స్వీకరిస్తున్నారు.

పట్టణంలో భారీ ర్యాలీ..

మంగళవారం ఉదయం 11 గంటలకు ఆసిఫాబాద్ పట్టణంలో ర్యాలీ నిర్వహించనున్నారు. అనంతరం జెండా ఆవిష్కరించనున్నారు. మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యక్రమాలు కొనసాగనున్నాయి. ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు, కోనేరు కోనప్ప, కుమురంభీం, ఆదిలాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్లు కోవ లక్ష్మి, రాథోడ్ జనార్దన్ హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. ప్రజలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ జిల్లా గౌరవ అధ్యక్షుడు రాథోడ్ శంకర్ నాయక్ పిలుపునిచ్చారు.

నేడు పాఠశాలలకు సెలవు

ఆసిఫాబాద్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు సంత్ సేవాలాల్ జయంతి సందర్భంగా మంగళవారం సెలవు ప్రకటిస్తూ కలెక్టర్ హేమంత్ బోర్కడే ఉత్తర్వులు జారీ చేశారు. దీనికి బదులుగా మార్చి 11న రెండో శని వారం పాఠశాలలు పనిచేస్తాయన్నారు.

'హథ్ సే హాథ్ జోడో అభియాన్'కు ఇన్‌చార్జీలు

- ఉమ్మడి జిల్లాలో పలువురికి బాధ్యతల అప్పగింత
- ఏఐసీసీ సభ్యులుగా మరోసారి పీఎస్సార్‌కు అవకాశం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా రాష్ట్ర కమిటీ ఉమ్మడి జిల్లాలో 'హథ్ సే హథ్ జోడో అభియాన్' కార్యక్రమ నిర్వహణ కోసం పది అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్‌చార్జీలను నియమించింది. ఈ మేరకు సోమవారం పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆ పార్టీ జనరల్ సెక్రెటరీలను ఈ కార్యక్రమ సమన్వయం చేసేందుకు నియమించారు. ఇందులో కొందరికి ఉమ్మడి జిల్లా నియోజకవర్గాలు, రెండేసి చొప్పున, మరికొందరికి జిల్లా పరిధితోపాటు ఇతర జిల్లాలోని నియోజకవర్గాలకు కలిపి బాధ్యతలు అప్పగించారు. ఇన్‌చార్జీలుగా నియమించిన వారంతా ఆయా ప్రాంతాల్లో ఈ కార్యక్రమం విజయవంతం చేసేలా కృషి చేయాల్సి ఉంది. ఏఐసీసీ సభ్యులుగా తమ పదవీ కాలం ముగిసిన కొంత మందికి మరోసారి అవకాశం కల్పించారు. ఉమ్మడి జిల్లా నుంచి మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుకు మరోసారి ఏఐసీసీ సభ్యులుగా అవకాశం కల్పించారు.

జనరల్ సెక్రెటరీ పేరు	నియోజకవర్గం
ఎం.జైపాల్‌రెడ్డి	సిర్పూర్, ఖానాపూర్
సత్తు మల్లేశ్	ఆసిఫాబాద్, బోథ్
జె.అనురుధ్‌రెడ్డి	నిర్మల్, ముధోల్
పి.హరికృష్ణ	ఆదిలాబాద్, నకిరేకల్
కె.రవణీరెడ్డి	చెన్నూరు, మంథని
ఎల్.ధన్వంతి	బెల్లంపల్లి, ధర్మపురి
జె.ఇందిరారావు	మంచిర్యాల

మత్తు పదార్థాలపై ప్రత్యేక దృష్టి అవసరం

- డీజీపీ అంజనీకుమార్



వీసీలో పాల్గొన్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్: నిషేధిత మత్తు పదార్థాలపై ప్రత్యేక దృష్టి సారించాలని డీజీపీ అంజనీకుమార్ అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణపై సోమవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నెలవారీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో గౌరవంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజల భద్రత విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, ప్రజల సమస్యలు వీలయినంత వేగంగా పరిష్కరించాలన్నారు. కేసుల విషయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడే వారికి చట్టపరంగా శిక్ష పడేలా చూడాలన్నారు. సమావేశంలో ఎస్పీ సురేశ్‌కుమార్, అదనపు ఎస్పీలు అచ్చేశ్వర్‌రావు, భీమ్‌రావు, డీఎస్పీలు శ్రీనివాస్, కరుణాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు విని.. అర్జీలు స్వీకరించి

- కలెక్టరేట్‌లో ప్రజావాణి
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ హేమంత్ బోర్కడే



అర్జీ పరిశీలిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ బోర్కడే హేమంత్ అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల సమస్యలు విని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సృజల స్రవంతి చేవేళ్ల ప్రాజెక్టులో భూములు కోల్పోయిన తమకు ఏడేళ్లుగా పరిహారం అందడం లేదని, వెంటనే పరిహారం అందించాలని పోతెపల్లి, కాతెపల్లి శివారు రైతులు అర్జీ పెట్టుకున్నారు. కెరమెరి మండలం ఖైరి పంచాయతీలో సాంకేతిక కారణాలతో క్షేత్ర సహాకుడి పోస్టు ఖాళీగా చూపిస్తోందని, ప్రస్తుతం అక్కడ పనిచేస్తున్న తన పేరు ఎంసీసీలో చేర్చాలని గిత్తె తులసీరాం విన్నవించాడు. వారసత్వంగా సంక్రమించిన భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి, పట్టా పాసుపుస్తకం మంజూరు చేయాలని కాగజ్‌నగర్ మండలం నజ్రూల్‌నగర్‌కు చెందిన సునీల్ కోరాడు. కొన్నేళ్లుగా పోడు వ్యవసాయం చేసుకుంటున్న నేపథ్యంలో తమ పేర్లు కాస్తు చేస్తున్నట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని వాంకిడి మండలం ఖమాన గ్రామానికి చెందిన గిరిజన రైతులు అర్జీ పెట్టుకున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన భూమి వివరాలను 'ధరణి'లో నమోదు చేయాలని రెబ్బెన మండలం పసిగాం డోంగ్రె శాంతాబాయి దరఖాస్తు చేసుకున్నారు. సిర్పూర్(టి) మండలం ఇటిక్యాల పహాడ్ పాఠశాలలో చేపడుతున్న మన ఊరు- మన బడి కార్యక్రమం పనులకు అటవీశాఖ అధికారులు అభ్యంతరం తెలుపుతున్నారని దీనిపై విచారణ చేపట్టాలని గ్రామస్తులు దేవిచంద్, పైకాజీ, మనోహర్ కోరారు. వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని కాగజ్‌నగర్‌కు చెందిన మోతె పోశం విన్నవించుకున్నాడు. ఇటీవల తన భర్త అనారోగ్యంతో మృతి చెందాడని, రైతుబీమా నగదు ఇప్పించాలని కాగజ్‌నగర్ మండలం నజ్రూల్‌నగర్‌కు చెందిన కమల్ మండల్ అర్జీ సమర్పించింది. కొత్త పట్టా పాసుపుస్తకంలో వివరాలు సక్రమంగా నమోదు చేయలేదని, వెంటనే సవరించాలని రెబ్బెన మండలం తక్కలపల్లికి చెందిన కమ్మరి కమల దరఖాస్తు చేసుకుంది. 2018 నుంచి తనకు వితంతు పింఛన్ మంజూరు కాగా, అధికారులు గ్రామానికి చెందిన వేరే వ్యక్తికి చెల్లిస్తున్నారని సమస్యను పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆసిఫాబాద్ మండలం సాలెగూడకు చెందిన సుందరబాయి కలెక్టర్‌కు విన్నవించింది. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్ బాజ్‌పాయ్, అధికారులు పాల్గొన్నారు.

'తుడుం'మోత

- ఉద్రిక్తంగా మారిన ఆదివాసీల ఐటీడీఏ ముట్టడి
- కార్యాలయంపై ఆందోళనకారుల రాళ్ల దాడి
- కిటికీ అద్దాలతో పాటు ఓ వాహనం ధ్వంసం
- పరిస్థితిని అదుపులోకి తెచ్చిన పోలీసులు
- ప్రభుత్వం దృష్టికి ఆదివాసీల సమస్యలు : ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో వరుణ్‌రెడ్డి



ఐటీడీఏ ఎదుట బైఠాయించిన ఆదివాసీలు



ఇన్‌చార్జి ఐటీడీవో పీవో వరుణ్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న తుడుందెబ్బ నాయకులు

ఉట్నూర్/ఉట్నూర్‌రూరల్: అస్తిత్వం కోసం ఆదివాసీలు పోరుబాట పట్టారు. ఎస్టీ జాబితాలో కొత్తగా 11 కులాలను చేర్చడంపై సర్కారు తీరును నిరసిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఉట్నూర్‌కు సోమవారం భారీగా తరలివచ్చి ఐటీడీఏను ముట్టడించారు. కార్యాలయంపై రాళ్లు రువ్వారు. ఓ వాహనాన్ని ధ్వంసం చేశారు. ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ఆందోళన ఓ దశలో ఉద్రిక్తంగా మారింది. ఆదిలాబాద్ జిల్లా ఎస్పీతో పాటు ఐటీడీఏ ఇన్‌చార్జి ప్రాజెక్టు అధికారి అక్కడికి చేరుకొని వారిని సముదాయించారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు.

ఉమ్మడి జిల్లా నుంచి తరలివచ్చి..

ఇటీవల ప్రభుత్వం ఇతర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీ తీర్మానం చేయడంతో ఏజెన్సీ వ్యాప్తంగా ఆదివాసీల ఆందోళనలు మొదలయ్యాయి. ఇందులో భాగంగా తుడుందెబ్బతో పాటు ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది ఆదివాసీ తెగలకు చెందిన అనుబంధ సంఘాలు ఐటీడీఏ ముట్టడికి పిలుపునిచ్చాయి. ఈ క్రమంలో వారంతా సోమవారం మధ్యాహ్నం భారీగా ఉట్నూర్‌కు చేరుకొని ఐటీడీఏ ఎదుట బైఠాయించారు. సంఘం నాయకులు మాట్లాడుతుండగానే ఒక్కసారిగా ఆదివాసీలంతా కార్యాలయంలోకి చొచ్చుకెళ్లే యత్నం చేశారు. ఓ వ్యక్తి ప్రధాన గేటు దూకుతుండగా పోలీసులు వారించారు. ఈ సమయంలో ఏటీడబ్ల్యూఏసీ చైర్మన్ కనక లక్కేరావు వాహనం ఐటీడీఏ నుంచి బయటకు వస్తుండగా కారుపై దాడి చేసి అద్దాలు ధ్వంసం చేశారు. వాహనంపై పెట్రోల్ పోసి నిప్పంటించే యత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలోనే కార్యాలయంపై రాళ్ల దాడి చేయడంతో కిటికీ అద్దాలు ధ్వంసం అయ్యాయి. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు ఆందోళనకారులను అదుపుచేసే యత్నం చేశారు.

ప్రాజెక్టు అధికారి రావాలంటూ పట్టు..

ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వచ్చేంత వరకు ఆందోళన విరమించేది లేదంటూ ఆదివాసీలు పట్టుపట్టారు. నిర్మల్ కలెక్టర్, ఇన్‌చార్జి ప్రాజెక్టు అధికారిగా ఉన్న వరుణ్‌రెడ్డి హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అర్హులందరికీ పోడు హక్కు పత్రాలు లభిస్తాయన్నారు. పీవో హామీతో వారు శాంతించారు. కార్యక్రమంలో తుడుందెబ్బ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు గణేశ్, ప్రధాన కార్యదర్శి బాపురావు, నాయకులు పాండురంగ్, మైపతి, అరుణ్‌కుమార్, ఉయిక సంజీవ్, రేణుక, పుష్పరాణి, ఉయిక ఇంద్ర, వెంకటేశ్, మాధవ్, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేయొద్దు

ఐటీడీఏ ముట్టడిలో చోటు చేసుకున్న ఉద్రిక్తత నేపథ్యంలో ఎలాంటి కేసులు నమోదు చేయలేదని సీఐ సైదారావు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. సంఘటనపై ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

అస్తిత్వం కోసమే పోరాటం:

తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్య


రాష్ట్ర ప్రభుత్వం 11కులాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీ తీర్మానం చేయడం ఆదివాసీల మనుగడను ప్రశ్నార్థకం చేయడమేనని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే చట్టబద్ధత లేకుండా ఎస్టీలుగా కొనసాగుతున్న లంబాడాల కారణంగా తమ హక్కులను కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చితే తమ ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని స్పష్టంచేశారు. ఆదివాసీలు సాగు చేస్తున్న అటవీ భూములకు షరతులు లేకుండా హక్కు పత్రాలు ఇవ్వడంతో పాటు పెసా, 1/70 చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. జీవో నం.3ను యథావిధిగా అమలు చేయడంతో పాటు ఇటీవల ప్రభుత్వం తీసుకువచ్చిన 317 జీవోను పూర్తిగా రద్దు చేయాలన్నారు. ఆదివాసీ బంధు ప్రకటించడంతో పాటు దేవాపూర్ సిమెంట్ ఫ్యాక్టరీతో భూములు కోల్పోయిన ఆదివాసీలను ఆదుకోవాలన్నారు.

శాంతియుతంగా పరిష్కరించుకోవాలి: ఎస్పీ

ఆదివాసీలు సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఐటీడీఏ ముట్టడి ఉద్రిక్తంగా మారడంతో ఆయన అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఆందోళనకారులతో మాట్లాడి ఆందోళన విరమించాలని సూచించారు. తమతో కలిసి వస్తే సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని ఆందోళన

- కలెక్టరేట్ వరకు పంచాయతీ కార్మికుల పాదయాత్ర, ధర్నా
- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

ఆసిఫాబాద్‌అర్బన్: గ్రామ పంచాయతీల్లో చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని, డిమాండ్లు నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో సోమవారం గ్రామ పంచాయతీ కార్మికులు చెక్‌పోస్టు నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ముంజం శ్రీనివాస్ మాట్లాడుతూ జీవో 60 ప్రకారం పారిశుధ్య కార్మికులకు రూ.15,600, కారోబార్, బిల్ కలెక్టర్లకు రూ.19,500, కంప్యూటర్ ఆపరేటర్లకు రూ.22,750 వేతనాలు చెల్లించాలన్నారు. మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించి, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్మికులకు డబుల్ బెడ్రూం ఇళ్లు, ఇంటి స్థలం ఉన్న వారికి రూ.5.50లక్షల ఆర్థికసాయం అందించాలన్నారు. అనంతరం కలెక్టర్ హేమంత్ బోర్కడేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి రాజు, ఉపాధ్యక్షుడు శంకర్, నాయకులు సమ్మయ్య, గణేశ్, తిరుపతి, సంతోష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మద్యానికి బానిసై యువకుడి బలవన్మరణం


బద్రి రాజేశ్‌ (ఫైల్‌)

నస్పూర్‌: మద్యానికి బానిసై యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన విలేజ్‌ నస్పూర్‌లో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై రవికుమార్‌ వివరాల ప్రకారం... రాజేశ్‌కి భీమారంకు చెందిన సునీతతో 12 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు అమ్మాయిలు. రాజేశ్‌ కొంతకాలంగా తాగుడుకు బానిసయ్యాడు. దీంతో భార్యాభర్తల మధ్య తరుచుగా గొడవలు జరుగుతుండేవి. దీంతో భార్య పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లింది. అప్పటి నుంచి ఒంటరిగానే ఉంటున్నాడు. సోమవారం ఉదయం రాజేశ్‌ సోదరుడు ప్రశాంత్‌ ఫోన్‌ లిఫ్ట్‌ చేయకపోవడంతో అతడు ఇంటికి వెళ్లి చూడగా ఉరేసుకుని కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వివాహితపై అత్యాచారం

రెబ్బెన(ఆసిఫాబాద్‌): మండల కేంద్రంలో ఒంటరిగా ఉన్న ఓ వివాహితపై అదే గ్రామానికి చెందిన దుర్గం సునీల్‌ అత్యాచారానికి పాల్పడటంతో పాటు కర్రతో దాడి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలు సోమవారం మహిళా మండలి సభ్యుల సహకారంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం బయటకు వచ్చింది. ఏఎస్సై తిరుమల వివరాల ప్రకారం... రెబ్బెన గ్రామ పంచాయతీలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న దుర్గం సునీల్‌ గత డిసెంబర్‌ 25వ తేదీన బాధిత మహిళ తన ఇంట్లో ఒంటరిగా ఉండడాన్ని గమనించి ఇంట్లోకి చొరబడి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అంతటితో ఆగకుండా కర్రతో చేతిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. విషయం ఎవరికైనా చెప్పితే చంపుతా అంటూ బెదిరించాడు. అయితే సోమవారం మహిళా మండలి సభ్యులను ఆశ్రయించి తనకు జరిగిన అన్యాయాన్ని వారికి వెల్లబుచ్చగా వారి సహకారంతో పోలీస్‌ స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

ఆసిఫాబాద్‌రూరల్‌: ఉరేసుకుని ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం వాంకిడి మండలం కానర్‌గాంలో చోటుచేసుకుంది. ఎస్సై రమేశ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. కానర్‌గాం గ్రామానికి చెందిన వాడై దత్తు (35) మద్యానికి బానిసయ్యాడు. నిత్యం మద్యం తాగివచ్చి ఇంట్లో గొడవ పడుతుండేవాడు. ఆదివారం మద్యం మత్తులో ఇంట్లో గొడవపడి బయటికి వెళ్లాడు. రాత్రి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు సోమవారం ఉదయం నుంచి వెతకడం ప్రారంభించారు. సాయంత్రం గ్రామం పక్కనే చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. దత్తుకు నలుగురు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

'కంటి వెలుగు' పరిశీలన

కాసిపేట: మండలంలోని ధర్మరావుపేట, ముత్యంపల్లి గ్రామాల్లోని కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం జిల్లా వైద్యా ఆరోగ్య అధికారి డాక్టర్‌ సుబ్బరాయుడు సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలకు వస్తున్న రోగుల వివరాలు తెలుసుకున్నారు. కంటి వెలుగు శిబిరంపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించడంతో పాటు అధిక సంఖ్యలో పరీక్షలకు హాజరయ్యేలా చూడాలన్నారు.

భాషతోనే భావవ్యక్తీకరణ

- రచనలు చేస్తున్న గురుకుల విద్యార్థులు
- నేడు మాతృభాష దినోత్సవం



గురుకుల సీఓఈ కళాశాల ముఖద్వారం

బెల్లంపల్లి: సకల చరాచర జీవుల్లో మానవ జీవి ఎంతో ఉన్నతమైంది. జంతువుల నుంచి మనిషిని దూరం చేసింది మనిషి మాట్లాడే భాష. అందుకే నోరుమంచిదైతే ఊరు మంచిదవుతుందనే నానుడి పుట్టుకొచ్చింది. భాషలన్నింటిలోనూ మాతృభాష తియ్యదనం ఎంతో ప్రత్యేకమైంది. అమ్మచేతి వంట రుచిని మాతృభాష మైమరిపిస్తుందంటే ఏమాత్రం అతిశయోక్తి కాదు. బెల్లంపల్లిలోని తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయం విద్యార్థులు ఆంగ్ల భాషలో విద్యను నేర్చుకుంటూ మాతృభాషను తర్వాత తరానికి మోసుకుపోతూ వారధిగా మారుతున్నారు. విద్యార్థులు అమ్మభాషలోని కమ్మదనాన్ని ఆస్వాదిస్తూ ...అలవోకగా కవితలు, రచనలు చేస్తూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. నేడు మాతృ భాషా దినోత్సవం సందర్భంగా మాతృభాషలో ప్రత్యేకతను చాటుకుంటున్న సంక్షేమ గురుకుల విద్యార్థులపై 'సాక్షి' అందిస్తున్న కథనం.

ప్రిన్సిపాల్‌ సైదులు ప్రోత్సాహంతో ....

బెల్లంపల్లి సంక్షేమ బాలుర గురుకులంలో 600 పైచిలుకు మంది విద్యార్థులు ఉన్నారు. వీరంతా ఆంగ్ల మాధ్యమంలో విద్యనభ్యసిస్తున్నారు. అయితేనే మీ తాము ఎదిగి వచ్చిన ఊరును, ఊరిలో మాట్లాడిన మాతృభాషను మరవకుండా ఎప్పటికప్పుడు నెమరు వేసుకుంటూనే ఉన్నారు. విద్యార్థుల మాతృభాషలో వస్తున్న సాహిత్యాన్ని, సంస్కృతి, సంప్రదాయాలను, వేషాధారణను మరిచి పోకుండా పాటిస్తున్నారు. స్వతహాగా సంక్షేమ సీఓఈ కళాశాల ప్రిన్సిపాల్‌ ఐనాల సైదులు తెలుగులో కవి, రచయిత కావడంతో విద్యార్థులను ఆదిశగా ప్రోత్సహిస్తున్నారు.

గురుకులంలో భిన్న భాషలు

గురుకుల విద్యాలయంలో తెలుగు, మరాఠీ, హిందీ, లంబాడి, గోండు, ఎరుకల భాషలు మాట్లాడే విద్యార్థులు ఉన్నారు. ఆయా భాషలతో పాటు విద్యనభ్యసించడంలో భాగంగా ఆంగ్ల భాషను నేర్చుకుని సంభాషించుకుంటున్నారు. మాట్లాడటమే కాదు సాహిత్య అంశాలపై చర్చించుకోవడం జరుగుతోంది. కవితలు, కథలు, గేయాలు రాయడం, ప్రత్యేకత కలిగిన రోజుల్లో కవితాగానాలు చేయడం, కథ చెప్పడంపై పోటీలు నిర్వహించుకోవడం ద్వారా విద్యార్థులు వారి మాతృభాషలో వస్తున్న సాహిత్యంపై అవగాహన పెంపొందించుకోవడమే కాకుండా సాహిత్యకారులపై అభిమానాన్ని పెంచుకుంటున్నారు.

సాహిత్యాంశాలపై విద్యార్థుల కార్యాచరణ

కవితా గానం, సాహిత్యాంశాలపై గురుకుల విద్యార్థులు ఎప్పటికప్పుడు కార్యచరణతో ముందుకు సాగుతున్నారు. సాహిత్యపరంగా విద్యార్థులు రాసిన మూడు పుస్తకాలను ఆన్‌లైన్‌ వేదికగా ముద్రించారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన పుస్తక ప్రదర్శనలో పెట్టగా సాహిత్య ప్రియుల నుంచి విశేష స్పందన లభించింది.

మాతృభాషలో పాటలు పాడుతా..



నా మాతృభాష లంబాడి. సీఓఈ కళాశాలలో ప్రస్తుతం నేను ఆంగ్ల మాధ్యమంలో ఇంటర్‌ ద్వితీయ సంవత్సరం చదువుతున్నా ను. నామాతృ భాష అంటే నాకు ఎంతో ఇష్టం. ఏటా మాతృ దినోత్సవం నాడు మాలంబాడా భాషలో పాటలు పాడుతుంటాను. మా భాషలో మా సంస్కృతి, సంప్రదాయాలు ఎన్నో ఉన్నాయి. కవితాగానం కూడా మాతృభాషలో చేయడం ఇష్టం. – భుక్యా అరవింద్‌, ఇంటర్మీడియెట్‌ విద్యార్థి, బెల్లంపల్లి

మాతృభాష అవసరం



భాష భావ వ్యక్తీకరణకు మాతృభాష అవసరం. ఏ మనిషి అయిన తనలోని భావాలను తోటివారితో ప ంచుకోవడానికి భాష ఉపయోగపడుతుంది. ఉత్తమ భావ వ్యక్తీకరణకు మాతృ భాష కీలకం. గురుకులంలో వారంలో రెండు రోజులు సాయంత్రం సమయాల్లో రెండు గంటల పాటు విద్యార్థులకు లాంగ్వేజ్‌ క్లబ్‌ ద్వారా పలు కార్యక్రమాలను నిర్వహిస్తూ మాతృ భాషాభిమానానికి తోడ్పడుతున్నాం. – ఐనాల సైదులు, సీఓఈ ప్రిన్సిపాల్‌, బెల్లంపల్లి

జాతీయస్థాయి క్రీడల్లో ఎస్పీఎం కార్మికుడి ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న అధికారులు

కాగజ్‌నగర్‌టౌన్‌: కాగజ్‌నగర్‌ పట్టణానికి చెందిన సిర్పూర్‌ పేపర్‌ మిల్లు కార్మికుడు పెరుక కృష్ణ క్రీడా పోటీల్లో మరోసారి ప్రతిభ చాటాడు. ఈనెల 16వ తేదీ నుంచి 19 వరకు హర్యానా రాష్ట్రం కురుక్షేత్ర జిల్లా కేంద్రంలోని స్టేడియంలో జరిగిన జాతీయ స్థాయి అథ్లెటిక్‌ పోటీల్లో వెండి పతకం సాధించాడు. ఈ సందర్భంగా ఎస్పీఎం ఉన్నతాధికారులతో పాటు తోటి కార్మికులు, క్రీడాకారులు ఆయనను అభినందించారు.

ఇంటర్‌ ప్రాక్టికల్‌ పరీక్షలు ప్రశాంతం

మంచిర్యాలఅర్బన్‌: ఇంటర్‌ ప్రాక్టికల్‌ సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం నిర్వహించిన పరీక్షలకు 529మంది విద్యార్థులకు గాను 483 మంది హాజరు కాగా 46 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 291మందికి గాను 281 మంది హాజరు కాగా 10 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను డీఐఈవో శైలజ పరిశీలించారు.

షార్ట్‌ఫైరర్‌పై డిస్మిస్‌ ఎత్తివేయాలి

- హెచ్‌ఎమ్మెస్‌ ప్రధాన కార్యదర్శి రియాజ్‌ అహ్మద్‌


మాట్లాడుతున్న రియాజ్‌ అహ్మద్‌

శ్రీరాంపూర్‌: కేటీకే 8 ఇంక్‌లైన్‌ గనిలో షార్ట్‌ఫైరర్‌ను కంపెనీ డిస్మిస్‌ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే వారిని తిరిగి ఉద్యోగంలో చేర్చుకోవాలని హెచ్‌ఎమ్మెస్‌ ప్రధాన కార్యదర్శి రియాజ్‌ అహ్మద్‌ డిమాండ్‌ చేశారు. సోమవారం ఆయన ఎస్సార్పీ 3 గనిపై నిర్వహించిన గేట్‌ మీటింగ్‌లో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. ఆ గనిలో జరిగిన మిస్‌ఫైర్‌ ప్రమాదాన్ని కారణంగా చూపుతూ షార్ట్‌ ఫైరర్‌ను డిస్మిస్‌ చేయడంతోపాటు సర్దార్‌కు, ఓవర్‌ మెన్లకు ఇంక్రిమెంట్‌ కట్‌ చేయడం దారుణమన్నారు. దీనిపై హెచ్‌ఎమ్మెస్‌ పోరాటం చేస్తోందన్నారు. ఎస్సార్పీ 3 గనిలో ఫ్యాటల్‌ యాక్సిండెంట్‌లో చనిపోయిన కృష్ణారెడ్డి కొడుకుకు వయస్సు ఎక్కువగా ఉందనే సాకుతో ఉద్యోగం ఇవ్వనుందని, దీనిపై తమ పోరాటం ఫలితంగా నేడు ఉద్యోగం ఇస్తున్నారన్నారు. దీనిపై గుర్తింపు సంఘం టీబీజీకేఎస్‌ నేతలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్‌ బ్రాంచీ కార్యదర్శి తిప్పారపు సారయ్య, కేంద్ర ఉపాధ్యక్షుడు వి.అనిల్‌రెడ్డి, నాయకులు గోళ్ల సత్తన్న, దుర్గం లక్ష్మణ్‌, మీస కొమురయ్య, నామాల శ్రీనివాస్‌, రేగుంట సందీప్‌, పి.అశోక్‌, తొగరి శ్రీను, వెంకటస్వామి, కంబాల నర్సయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

- జెడ్పీ చైర్‌పర్సన్‌ కోవ లక్ష్మి
- కోరమాండల్‌ ఇంటర్నేషనల్‌ లిమిటెడ్‌ కంపెనీ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు



పురస్కారం అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్‌ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే సక్కు

ఆసిఫాబాద్‌: విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్‌ కోవ లక్ష్మి అన్నారు. కోరమాండల్‌ ఇంటర్నేషనల్‌ లిమిటెడ్‌ కంపెనీ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పదో తరగతి గ్రామీణ విద్యార్థినిలకు 'గ్రామీణ బాలికల ప్రతిభ పురస్కారాలు' సోమవారం జిల్లా కేంద్రంలోని రోజ్‌ గార్డెన్‌లో అదనపు కలెక్టర్‌ చాహత్‌ బాజ్‌పాయి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, కంపెనీ జోనల్‌ మేనేజర్‌ మనోజ్‌కుమార్‌తో కలిసి అందజేశారు. 9వ తరగతి మార్కుల ఆధారంగా విద్యార్థినులను పురస్కాలకు ఎంపిక చేశారు. జిల్లాలోని 50 జెడ్పీ హైస్కూళ్లకు చెందిన 100 మంది విద్యార్థినులను ఎంపిక చేయగా, మొదటి బహుమతి కింద 50 మందికి ఒక్కొక్కరికి రూ.5వేలు, ద్వితీయ బహుమతి కింద 50 మందికి ఒక్కొక్కరికి రూ.3,500/– బ్యాంకు ఏటీఎం కార్డు ద్వారా, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్‌ మాట్లాడుతూ బాలికలు చదువులో రాణించాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పదో తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అదనపు కలెక్టర్‌ చాహత్‌ బాజ్‌పాయి మాట్లాడుతూ బాలికలు బాలురతో పోటీ పడి చదువుల్లో ముందుండాలన్నారు. అత్యున్నత స్థాయికి ఎదిగి జిల్లాకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. డీఈవో అశోక్‌ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలకు మరో నెల రోజుల సమయం ఉందని, విద్యార్థులు కష్టపడి చదివితే అత్యధిక మార్కులు సాధించి, బాసర ట్రిబుల్‌ ఐటీలో సీటు పొందవచ్చన్నారు. కోరమాండల్‌ కంపెనీ డివిజనల్‌ అగ్రామనిస్ట్‌ డాక్టర్‌ టి.సుధాకర్‌ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రావూరి శ్రీనివాస రావు, డీఈవో పి.అశోక్‌, టీఆర్‌ఎస్‌ నాయకులు గందం శ్రీనివాస్‌, అహ్మద్‌ బిన్‌ అబ్దుల్లా, కంపెనీ ప్రతినిధులు కటుకం ప్రసాద్‌, రుక్మాంగధర్‌రెడ్డి, నాగరాజు, కుమార్‌, ప్రియతంరెడ్డి పాల్గొన్నారు.

27న రజక వృత్తిదారుల జిల్లా మహాసభ


పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: ఈ నెల 27 జిల్లా కేంద్రంలోని తాపీమేస్త్రీ భవనంలో నిర్వహించే రజక వృత్తిదారుల 3వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని రజక వృత్తిదారుల జిల్లా కమిటీ అధ్యక్షులు లక్ష్మణ్‌, ప్రధాన కార్యదర్శి పాయిరాల రాములు కోరారు. ఈ సందర్భంగా మహాసభ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాలో రజకులకు ఉచిత విద్యుత్‌ పథకం ద్వారా 1176 మంది లబ్ధిపొందుతున్నారని, సకాలంలో విద్యుత్‌ సబ్సిడీ రావడం లేదనే నెపంతో విద్యుత్‌ అధికారులు విద్యుత్‌ కనెక్షన్‌లు కట్‌ చేస్తున్నారన్నారు. విద్యుత్‌ అధికారులు వేధింపులు ఆపాలని డిమాండ్‌ చేశారు. బీసీ కార్పొరేషన్‌ ద్వారా రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న 2000 మంది రజకులకు మూడేళ్లు అవుతున్నప్పటికీ రుణాలు మంజూరు కాలేదన్నారు. జిల్లాలోని మున్సిపాలిటీలలో మోడ్రన్‌ దోబీఘాట్‌లు నిర్మించాలని డిమాండ్‌ చేశారు. మహాసభకు అధిక సంఖ్యలో రజకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ముష్కర చందు పాల్గొన్నారు.

కుక్కలదాడిలో జింక మృతి

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ గోల్‌బంగ్లా బస్తీ శివారు అటవీ ప్రాంతంలో ఓ జింక కళేబరాన్ని అటవీశాఖ అధికారులు గుర్తించారు. సోమవారం అటవీ రేంజ్‌ అధికారి సుభాష్‌, డెప్యూటీ రేంజ్‌ అధికారి గౌరి శంకర్‌, ఫారెస్టు బీట్‌ అధికారి శంకర్రావు సమాచారం మేరకు సంఘటన స్థలాన్ని సందర్శించారు. జింక కళేబరాన్ని పరిశీలించి పిచ్చికుక్కల దాడిలో మృతిచెంది ఉంటుందని అనుమానాలు వ్యక్తం చేశారు. తాగునీటి కోసం రావడంతో పిచ్చికుక్కలు దాడి చేసి వధించి ఉంటాయని పేర్కొన్నారు. జింక కళేబరాన్ని మండల పశువైద్యాధికారి పావని ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించి అటవీ రేంజ్‌ కార్యాలయం ఆవరణలో ఖననం చేయించారు.

22నుంచి నట్టల నివారణ కార్యక్రమం

మంచిర్యాలఅగ్రికల్చర్‌: జిల్లాలో ఈ నెల 22 నుంచి 28వరకు నట్టల నివారణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా పశు వైద్య, పశు సంవర్ధకశాఖ అధికారి వై.రమేష్‌ తెలిపారు. జిల్లాలోని 18 మండలాల్లో దాదాపు 27 బృందాలు గ్రామ గ్రామాన ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి 5,20,731 గొర్రెలు, లక్షా 83,526 మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందు అందిస్తాయని తెలిపారు. మందు అందించడం ద్వారా రోగనిరోధక శక్తి పెంపొంది రక్తహీనత నియంత్రిచబడి మరణాల శాతం తగ్గుతుందని, తెలిపారు. అన్ని మండలాల్లోని పశు వైద్యులు, సిబ్బంది స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో కార్యక్రమం విజయవంతానికి కృషి చేయాలని, జిల్లాలోని గొర్రెలు, మేకల పెంపకందారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

అల్పాహారం మధ్యాహ్న భోజన కార్మికులతో ఇప్పించాలి

మంచిర్యాలఅర్బన్‌:"పదో తరగతి విద్యార్థులకు అల్పాహారాన్ని మధ్యాహ్న భోజనం కార్మికుల ద్వారా అందించాలని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం డీఈవో కార్యాలయంలో సెక్టోరల్‌ అధికారి చౌదరికి వినతిపత్రం అందజేశారు. సాయంత్రం పూట అందించే అల్పాహారాన్ని హెచ్‌ఎంల ద్వారా అందిస్తున్నారన్నారు. కొంత మంది ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు రాజేశ్వరి, సభ్యులు సరిత, సునీత, రంజిత్‌, తిరుపతి, రాంచందర్‌ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక పరికరాలపై ఉద్యోగులకు అవగాహన


ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రెబ్బెన(ఆసిఫాబాద్‌): అగ్నిప్రమాదాల నివారణకు ఉపయోగించే అగ్నిమాపక పరికాలపై సోమవారం బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీలో ఉద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. బెల్లంపల్లి రీజియన్‌ రెస్క్యూ ఇన్‌చార్జి రామ్మోహన్‌ మొదటి, రెండవ షిఫ్ట్‌ల్లో ఓసీపీలో పనిచేస్తున్న ఉద్యోగులకు పరికరాలను వినియోగించే పద్ధతులను వివరించారు. ప్రతి ఒక్క ఉద్యోగి పరికరాల వినియోగంపై అవగాహన పెంచుకుని అగ్ని ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు. చిన్న తప్పిదాలు, పరికరాల వాడకంపై పూర్తి స్థాయిలో అవగాహన లేకపోవటంతోనే గనుల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఏరియా జీఎం దేవేందర్‌, ఎస్‌వోటూజీఎం గుప్తా, పీఈ రాజాజీ, మేనేజర్‌ ప్రవీణ్‌ ఫటింగ్‌, సేఫ్టీ అధికారి రాజేశ్వర్‌రావు, టీబీజీకేఎస్‌ ఫిట్‌ కార్యదర్శి వెంకటేశం, సీనియర్‌ పర్సనల్‌ అధికారి వేణు తదితరులు పాల్గొన్నారు.


తీర్థం ముగిసింది..వ్యర్థాలు మిగిలాయి



శివరాత్రి పుణ్యస్నానాలు, పూజలు ముగిసాయి. మంచిర్యాల గోదావరి నది తీరంలో మాత్రం వ్యర్థ పదార్థాలు నిండాయి. శివరాత్రి పర్వదినం సందర్భంగా శని, ఆదివారాల్లో జిల్లా కేంద్రంలోని గోదావరి పుష్కరఘాట్‌ వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. వ్యర్థాలను ఇక్కడే వదిలి వెళ్లడంతో తీరమంతా చెత్తాచెదారం నిండి కనిపిస్తోంది. – సాక్షి ఫొటోగ్రాఫర్‌, మంచిర్యాల

ఎంఎస్‌సీఏ రిసెర్చ్‌కు మండలవాసి


మోహన్‌బాబు

జన్నారం: మండలంలోని తంగెళ్లపల్లి గ్రామానికి చెందిన మోహన్‌బాబు డెన్మార్క్‌లోని అల్బర్గ్‌ విశ్వ విద్యాలయంలో నిర్వహించే మేరీక్యూరి పోస్ట్‌ డాక్టరోల్‌ రిసెర్చ్‌ ఫెలోషిప్‌ (ఎంఎస్‌సీఏ)కు ఎంపిక య్యాడు. తాను రాసిన డ్రగ్‌ డెలివరీ అండ్‌ కంట్రోల్‌ రిలీజ్‌ ఫ్రం బయో కంపటేబుల్‌ మెటల్‌ ఆర్గానిక్‌ ఫ్రేం వర్క్స్‌ యూజ్‌డ్‌ ఫ్రైమ్‌ బయోమెడికల్‌ అప్లికేషన్‌ అనే ప్రాజెక్టు ప్రతిపాదనకు యూరోపియన్‌ కమిషన్‌ ప్రభుత్వం ఎంపిక చేసినట్లు మోహన్‌బాబు తెలిపారు. దీంతో మోహన్‌బాబును గ్రామస్తులు నరేశ్‌, వెంకటేశ్‌, సురేశ్‌, రాజన్న, జగన్‌, వంశీ, సన్నీలు అభినందించారు.

కోత విధించిన డబ్బులను తిరిగి చెల్లించాలి


మాట్లాడుతున్న ఏరియా కార్యదర్శి అంబాల ఓదెలు

రెబ్బెన(ఆసిఫాబాద్‌): బెల్లంపల్లి ఏరియాలో పనిచేస్తున్న ప్రైవేటు సెక్యూరిటీ గార్డులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా వేతనాల్లో నుంచి వృత్తి పన్ను పేరుతో కోత విధించిన డబ్బులను తిరిగి చెల్లించాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం ఏరియా కార్యదర్శి అంబాల ఓదెలు అన్నారు. సోమవారం గోలేటిలో నిర్వహించిన సెక్యూరిటీ గార్డుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏరియాలో పనిచేసే సెక్యూరిటీ గార్డులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా వేతనాల్లో నుంచి వృత్తి పన్ను పేరుతో ఒక్కొక్కరికి రూ.600 కోత విధించారన్నారు. దీనిపై ప్రైవేటు సెక్యూరిటీ గార్డుల సంస్థను అడిగితే ప్రభుత్వ ఆదేశాల మేరకే కోతలు విధించినట్లు చెబుతుండడం విడ్డూరంగా ఉందన్నారు. సింగరేణిలో ఎక్కడ లేని విధంగా కేవలం బెల్లంపల్లి ఏరియాలో మాత్రమే వృత్తి పన్నును కట్‌ చేయటం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉంటే చూపించాలని సవాల్‌ విసిరారు. అసలే జీతాల్లో పెరుగుదల లేక ఇబ్బందులకు గురవుతున్నా ప్రైవేటు సెక్యూరిటీ గార్డులు కుటుంబాలను పోషించుకునేందుకు నానా తంటాలు పడుతున్నారని అన్నారు. ఇలా వేతనాల్లో నుంచి కోత విధించిన డబ్బులను వెంటనే కార్మికులకు చెల్లించాలని డిమాండ్‌ చేశారు.


పీఏసీఎస్‌ చైర్మన్‌, వైస్‌చైర్మన్‌పై అవిశ్వాసం?

- క్యాంపునకు తరలిన 8మంది డైరెక్టర్లు..


నెల్కివెంకటాపూర్‌ సహకార సంఘ భవనం

దండేపల్లి: మండలంలోని నెల్కివెంకటాపూర్‌ సహకార సంఘం చైర్మన్‌, వైస్‌చైర్మన్లపై మెజారిటీ సభ్యులు అవిశ్వాసానికి తెరలేపినట్లు సమాచారం. దీంతో సంఘంలోని ఎనిమిది మంది డైరెక్టర్లు ఆదివారం రాత్రి రహస్య శిబిరానికి తరలినట్లు తెలుస్తోంది. ఈ విషయం దండేపల్లి మండలంలో సోమవారం చర్చనీయాంశంగా మారింది. చైర్మన్‌ లింగన్న, సంఘం డైరెక్టర్ల మధ్య సమన్వయ లోపం, సంఘం కార్యక్రమాల్లో డైరెక్టర్లకు సరైన సమాచారం ఇవ్వకుండా ఒంటరిగా పోవడమే ప్రధాన కారణాలుగా తెలుస్తోంది. దీంతో డైరెక్టర్లు, చైర్మన్‌, వైస్‌చైర్మన్లపై అవిశ్వాసం పెట్టేందుకు నిర్ణయించినట్లు తెలిసింది. సంఘం చైర్మన్‌, వైస్‌చైర్మన్ల ఎన్నిక 15 ఫిబ్రవరి 2020లో నిర్వహించారు. సంఘంలో 13 మంది డైరెక్టర్లకు ఒకదానికి ఎన్నిక నిర్వహించలేదు. మిగిలిన 12మందిలో ఒక డైరెక్టర్‌ చనిపోయాడు. ప్రస్తుతం చైర్మన్‌, వైస్‌ చైర్మన్‌ కలుపుకుని మొత్తం 11మంది సభ్యులకు ప్రస్తుతం 8మంది డైరెక్టర్లు క్యాంపునకు తరలినట్లు సమాచారం. ఈ విషయమై జిల్లా సహకార సంఘం అధికారి కృష్ణను 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా అవిశ్వాస తీర్మాన నోటీసును అందించేందుకు కొందరు తమ కార్యాలయానికి వచ్చారని, నేను అందుబాటులో లేకపోవడంతో వారు వెళ్లిపోయారని తెలిపాడు.

సైకిల్‌యాత్ర అభినందనీయం


ఆశా మాల్వియాను అభినందిస్తున్న ఏసీపీ సదయ్య

బెల్లంపల్లి/మందమర్రిరూరల్‌: ఆశా మాల్వియా సైకిల్‌ యాత్ర విజయవంతం కావాలని బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య అన్నారు. మహిళల రక్షణ కోసం ఆశా మాల్వియా చేపట్టిన సైకిల్‌ యాత్ర సోమవారం బెల్లంపల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా ఏసీపీ సదయ్య మాల్వియాకు స్వాగతం పలికి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మధ్యప్రదేశ్‌ రాష్ట్రానికి చెందిన ఆశా మాల్వియా మహిళల రక్షణను కాంక్షిస్తూ సైకిల్‌ యాత్ర చేపట్టడం గొప్ప విషయమన్నారు. ఆశా మాల్వియా మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 25 లక్షల కిలో మీటర్లు యాత్ర చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. గతేడాది నవంబర్‌ 1న మధ్యప్రదేశ్‌ రాష్ట్రంలోని రాహోపాల్‌ నుండి ప్రారంభించిన యాత్ర ఇప్పటి వరకు గుజరాత్‌, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌ సాగిందని తెలిపారు.